సాక్షి
కుమురం భీం

ఆదివారం, 28, ఏప్రిల్, 2024



శుభ విరామం
పెళ్లిళ్లు, శుభాకార్యాలకు ఆదివారం నుంచి బ్రేక్ పడనుంది. శ్రావణ మాసంలోనే మళ్లీ కొత్త ముహూర్తాలున్నట్లు పండితులు చెబుతున్నారు. 8లో▸



అధ్వానంగా ఎడమ కాలువ
కుమురంభీం ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. కాలువ పొడవున సిమెంట్ లైనింగ్ ఊడి పోయింది. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
41.7 /29.3
ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో ఎండ వేడి ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

29 నుంచి సదరం క్యాంపులు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలో ఈ నెల 29 నుంచి సదరం క్యాంపులు నిర్వహిస్తున్నామని డీఆర్‌డీవో సురేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సదరం సర్టిఫికెట్‌తోపాటు కాలపరిమితి ముగిసిన వారు పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య సేవా కేంద్రంలో పరీక్షలు చేయించుకుని, స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత క్యాంపులకు హాజరు కావాలన్నారు. ఈ నెల 29న మూగ, చెవిటి, కంటి చూపు, 30న మానసిక వైకల్యం, ఎముకలు, మే 7న కంటిచూపు, 18న మానసిక వైకల్యం, 21న మూగ, చెవిటి, 28న ఎముకల సంబంధిత వ్యాధులకు క్యాంపు కొనసాగుతుందని పేర్కొన్నారు.

పోలింగ్ శాతం పెంచాలి



సెల్ఫీ బోర్డు వద్ద ఎన్నికల పరిశీలకుడు, కలెక్టర్, అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్: జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు కృషి చేయాలని ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' సెల్ఫీ బోర్డు వద్ద శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, సిర్పూర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దీపక్ తివారితో కలిసి ఫొటో దిగారు. రాజేంద్ర విజయ్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునే విధంగా విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు కేటాయించినట్లు తెలిపారు. అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. డీఆర్‌డీవో సురేందర్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీవో ప్రసాద్, ఐటీడీఏ ఏఈ బద్రుద్దీన్ ఉన్నారు.

ఆదిలాబాద్ ఆర్వోపై ఈసీకి ఫిర్యాదు

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పూర్తి వివరాలు నమోదు చేయకుండా దాఖలు చేసిన బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ నామినేషన్‌ను ఆమోదించిన ఆదిలాబాద్ రిటర్నింగ్ అధికారి రాజర్షిషాపై చర్య తీసుకోవాలని బీఆర్‌ఎస్ విజ్ఞప్తి చేసింది. ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు దాసోజు శ్రావణ్ శనివారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు పార్టీ జిల్లా నాయకులు తెలిపారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న రోబోటిక్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో శనివారం రోబోటిక్ సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో రోబోటిక్స్, డ్రోన్‌ల వినియోగం పెరిగిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు టెక్నాలజీపై నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. మూడు రోజులపాటు అందించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల సమితి అధ్యక్షుడు సతీశ్‌బాబు, కార్యదర్శి వేణుగోపాల్, పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, హెచ్‌ఎం కోటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ హెల్త్ చాలెంజ్



కార్మికుడికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

- ఈ నెల 30 వరకు ఉచిత వైద్యశిబిరం
- 'గ్రాండ్ హెల్త్ చాలెంజ్ 2.0'లో భాగంగా 17 రకాల పరీక్షలు
- రక్త నమూనాలు సేకరణ..
- ఆసిఫాబాద్ డిపోలో 331 మంది ఉద్యోగులు

ఆసిఫాబాద్: ఆదాయం పెంచుకునేందుకు ఆర్టీసీ యాజమాన్యం నిత్యం పలు కార్యక్రమాలు చేపడుతోంది. అలాగే ప్రమాదాల నివారణ చర్యలతోపాటు విధి నిర్వహణలో ప్రతిభ చూపిన వారికి ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లుగా అవార్డులు అందిస్తూ ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలో యాజమాన్యం కార్మికుల ఆరోగ్యంపై దృష్టి సారించింది. విధి నిర్వహణలో ఒత్తిడి కారణంగా కార్మికులు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇది సంస్థ ఆదాయంపై ప్రభావం చూపుతోంది. కార్మికుల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు చర్యలు చేపట్టింది. కార్మికులందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో గతేడాది నుంచి ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 'గ్రాండ్ హెల్త్ చాలెంజ్' పేరుతో కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని డిపోల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఈ నెల 26 నుంచి 30 వరకు ఐదురోజుల పాటు ఉచిత వైద్యశిబిరం కొనసాగనుంది. ఈ నెల 26న ఆ సంస్థ రీజనల్ మేనేజర్ సోలోమాన్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన కాల్ హెల్త్ సంస్థ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ టీంలో ఒకరు సైట్ ఇన్‌చార్జి, ఐదుగురు టెక్నీషియన్లు ఉన్నారు.

17 రకాల వైద్య పరీక్షలు..

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో 331 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 126 మంది కండక్టర్లు, 126 డ్రైవర్లు, 58 మంది హైర్ బస్ డ్రైవర్లతోపాటు మెయింటనెన్స్ సిబ్బంది ఉన్నారు. 'గ్రాండ్ హెల్త్ చాలెంజ్ 2.0' కింద వీరందరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. బీపీ, షుగర్, ఊపిరితిత్తులు, గుండె, కాలేయం, కంటి పరీక్షలు, కొలెస్ట్రాల్, తదితర 17 రకాల పరీక్షలు చేస్తున్నారు. నమూనాలు సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపిస్తున్నారు. రోజుకు వంద మంది చొప్పున ఇప్పటివరకు 200 మందిని పరీక్షించారు. ఈ నెల 30 వరకు డిపోలోని కార్మికులందరికీ వైద్య పరీక్షలు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. గతేడాది 335 మంది కార్మికులకు వైద్య పరీక్షలు చేశారు. కార్మికుల్లో ఎక్కువ మంది షుగర్, బీపీతో బాధపడుతున్నట్లు గుర్తించారు. రెగ్యులర్ చెకప్‌తో వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. కార్మికుల నుంచి సేకరించిన రక్తనమూనాలతో ఏమైనా వ్యాధులు గుర్తిస్తే ముందు జాగ్రత్తల ద్వారా కార్మికులు ప్రాణాపాయం నుంచి బయటపడేందుకు ఆస్కారం ఉంటుంది. ఫలితాల ఆధారంగా చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆరోగ్యానికి భద్రత



ఆర్టీసీ యాజమాన్యం ప్రారంభించిన గ్రాండ్ హెల్త్ చాలెంజ్ కార్యక్రమంతో కార్మికుల ఆరోగ్యానికి భద్రత లభిస్తోంది. విధి నిర్వహణలో బిజీగా ఉండే కార్మికులకు రెగ్యులర్‌గా వైద్యపరీక్షలు చేయడంతో వ్యాధులు నిర్ధారణ అవుతాయి. నేను కూడా పరీక్షలు చేయించుకున్నా. ముందు జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– ఎండీ తాహెర్, ఆర్టీసీ డ్రైవర్, ఆసిఫాబాద్

కార్మికులకు ఉపయోగకరం



గ్రాండ్ హెల్త్ చాలెంజ్ పేరుతో ప్రారంభించిన ఉచిత వైద్యశిబిరం కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేయించుకుంటే రూ.వేలు చెల్లించాల్సి వస్తుంది. సంస్థ ఏటా వైద్యపరీక్షలు నిర్వహించడం ద్వారా సంస్థలో వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గుతుంది. దీర్ఘకాలిక వ్యాధులు గుర్తిస్తే చికిత్స తీసుకునేందుకు వీలవుతుంది.

– దుర్గం గోపి, డ్రైవర్, ఆసిఫాబాద్

పరీక్షలు చేయించుకోవాలి



ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న గ్రాండ్ హెల్త్ చాలెంజ్ కార్యక్రమంలో ప్రతీ కార్మికుడు వైద్యపరీక్షలు చేయించుకోవాలి. కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే విధులు సక్రమంగా నిర్వహించగలరు. ఈ నెల 30 వరకు జిల్లా కేంద్రంలోని డిపోలో వైద్యశిబిరం కొనసాగుతుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– విశ్వనాథ్,
ఆర్టీసీ డిపో మేనేజర్, ఆసిఫాబాద్

అగ్రనేతలొస్తున్నారు!



కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ



సీఎం రేవంత్‌రెడ్డి

- ప్రచార కార్యాచరణ తయారీలో పార్టీలు
- నిర్మల్‌కు త్వరలో అగ్రనేత రాహుల్‌గాంధీ
- కాగజ్‌నగర్, ముధోల్‌కు యోగి లేదా షా
- ఇప్పటికే ఆదిలాబాద్‌కు వచ్చిన రేవంత్
- క్యాడర్‌లో జోష్ నింపిన మోదీ పర్యటన

సాక్షి, ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నాయి. వివిధ రాజకీయ పార్టీలు ప్రచార వేగం పెంచాయి. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాయి. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ కొంత వెనుకబడినట్లు కనిపిస్తోంది. కాగా, కమలం, హస్తం పార్టీల నుంచి అగ్రనేతల పర్యటనకు సంబంధించి ప్రణాళిక రూపొందిస్తున్నారు. వారం రోజుల్లోనే వారి పర్యటనలు ఉండే అవకాశం ఉంది.

ఓటర్ల ప్రసన్నం కోసం పాట్లు

ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వివిధ పార్టీల ఎంపీ అభ్యర్థులు నానా పాట్లు పడుతున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. నిత్యం ఒకట్రెండు నియోజకవర్గాలు టచ్ చేస్తూ అభ్యర్థులు తమ ప్రచార పర్వం కొనసాగిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్, కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ ప్రచారంలో దూసుకుపోతున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు ప్రచార పర్వంలో కొంత వెనుకబడ్డారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా, ప్రతీ బూత్ స్థాయిలో ప్రజలను కలవాలని బీజేపీ నేతలు పార్టీ కార్యకర్తలను ఆదేశించారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలని సూచిస్తున్నారు. మోదీ మళ్లీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించాలని చెబుతున్నారు. బీజేపీ సంకల్ప్ పత్ర్ మేనిఫెస్టో గురించి జనాలకు వివరించాలని ఆదేశిస్తున్నారు. బూత్ స్థాయిలో ప్రతీ ఓటరును కలవాలని పార్టీ నేతల నుంచి ఆదేశాలు ఉండడంతో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రధానంగా ఓటర్లను కలిసినప్పుడు రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన గ్యారంటీల గురించి వివరిస్తున్నారు. కాంగ్రెస్ విడుదల చేసిన మేనిఫెస్టో న్యాయ్‌పత్ర్‌ను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

అగ్రనేతల పర్యటన ఉండేలా..

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ, కాంగ్రెస్ ప్రచారంలో భాగంగా ఆయా పార్టీల అగ్రనేతలను రప్పించేందుకు వ్యూహరచన చేస్తున్నారు. ఆదిలాబాద్‌లో ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటించి క్యాడర్‌లో జోష్ నింపారు. దీంతో బీజేపీ నేతలు, కార్యకర్తలు ప్రచారంలో ఉత్సాహంగా ముందుకుసాగుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఆదిలాబాద్‌లో పర్యటించి క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు. కాగా, మే 5లోగా నిర్మల్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రానున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు ఈ సభలో పాల్గొననున్నారు. పార్టీ ఇందుకు సంబంధించిన ప్రణాళిక రూపొందిస్తోంది. త్వరలోనే ఈ పర్యటన పూర్తి స్థాయిలో ఖరారు కానుంది. కాగా, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా లేదా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పర్యటించే అవకాశముంది. కాగజ్‌నగర్, ముధోల్‌లో సభలు నిర్వహించాలని బీజేపీ ప్లాన్ చేస్తోంది. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా బీజేపీ పర్యటనలో పాల్గొననున్నారు.

'బీజేపీని మరోసారి గెలిపించాలి'



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నగేశ్

రెబ్బెన(ఆసిఫాబాద్): దేశాభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. మండలంలోని నార్లాపూర్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో పలువురు బీజేపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ బీజేపీకి ఓటు వేసి కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వాన్ని తీసుకురావాలన్నారు. పార్లమెంట్ కన్వీనర్ భూమన్న, జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, నాయకులు కోట్నాక విజయ్, అత్మారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తి మార్చుకోకుంటే కఠిన చర్యలు

- ఎస్పీ సురేశ్‌కుమార్
- గంజాయి నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారు నేర ప్రవృత్తి మార్చుకోవాలని, లేని పక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాత నేరస్తులు, గంజాయి కేసుల్లో పట్టుబడిన నిందితులకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ప్రతీ పోలీసు స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో సోదాలు నిర్వహించామన్నారు. వాహనాలు, రైళ్ల తనిఖీ, అనుమానిత ప్రాంతాలు, పాత నేరస్తుల ఇళ్లను సోదా చేయడానికి ప్రత్యేక టీంను నియమించామని పేర్కొన్నారు. వంజిరీ చెక్‌పోస్టు, సిర్పూర్(టి) పోలీసు స్టేషన్ ఎదుట, చింతలమానెపల్లి శివాజీచౌక్‌లో తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఇప్పటివరకు ఏడు కేసుల్లో 11 మంది నేరస్తులను ఆరెస్టు చేశామని, ఆరు కేసుల్లో 3,112 కేజీల గంజాయిని పట్టుకున్నామని వెల్లడించారు. గంజాయి విలువ రూ.77,050 ఉంటుందన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలను అరికట్టడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీఎస్పీ సదయ్య, ఎస్బీ సీఐ రాణాప్రతాప్, టౌన్ సీఐ సతీశ్, ఎస్సై ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీల కలవరం!

- వేసవిలో పెరిగిన దొంగతనాలు
- కాగజ్‌నగర్ పట్టణంలో వరుస ఘటనలు
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన



చోరీ జరిగిన ఇంట్లో వివరాలు సేకరిస్తున్న పోలీసులు (ఫైల్)

కౌటాల(సిర్పూర్): వేసవి ప్రారంభంతో జిల్లాలో మళ్లీ చోరీలు పెరుగుతున్నాయి. విద్యా సంస్థలకు సెలవులు రావడం, శుభకార్యాలు అధికంగా ఉండటంతో చాలా మంది ఇళ్లకు తాళం కుటుంబం మొత్తం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. సెలవులు ఆనందంగా గడిపేందుకు ఇంటిల్లిపాది విహార యాత్రలకు పయనమవుతున్నారు. ఈ అవకాశాన్ని దొంగలు అవకాశంగా తీసుకుంటున్నారు. తాజాగా కాగజ్‌నగర్‌లోని పెట్రోల్‌పంపు ఏరియాలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న మున్నీ బార్ అండ్ రెస్టారెంట్‌లో శనివారం తెల్లవారుజామున రూ.3 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. మండలంలోని భట్‌పల్లిలో మూడున్నర తులాల బంగారంతో పాటు రూ.50 వేల నగదు చోరీకి గురైంది.

కలవరపెడుతున్న వరుస చోరీలు

జిల్లా మహారాష్ట్రకు సరిహద్దుగా ఉండటంతో ఇక్కడ దొంగతనాలు సర్వసాధారణంగా మారాయి. ఎన్నికల సమయం కావడంతో పోలీసులు బిజీగా ఉన్నారు. దీంతో చోరీలు పెరిగాయి. గడిచిన మూడేళ్లలో దాదాపు వందకు పైగా దొంగతనాలు జరిగినట్లు పోలీసు రికార్డులు చెబుతున్నారు. మండుతున్న ఎండల్లోనూ పగటిపూట రెక్కీ నిర్వహిస్తున్న దుండగులు తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తిస్తున్నారు. రాత్రి పూట గుట్టుచప్పుడు కాకుండా గుర్తించిన ఇళ్లను లూటీ చేస్తున్నారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతమైన కాగజ్‌నగర్ పట్టణంలో దొంగతనాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అలాగే ఆసిఫాబాద్, రెబ్బెన, వాంకిడి, చింతలమానెపల్లి, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, కౌటాల మండలాల్లోనూ అడపాదడపా ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

పోలీసుల సూచనలు

- వేసవి సెలవుల్లో ప్రజలు వేరే ఊర్లకు వెళ్లాల్సి వస్తే విలువైన ఆభరణాలు, నగదును ఇంట్లో ఉంచుకోవద్దు. బంగారు ఆభరణాలు వీలయినంత వరకు బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి. చాలారోజుల పాటు ఇంట్లో ఉండని పరిస్థితులు ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలి.
- బైక్‌లు, కార్లు రోడ్డుపై కాకుండా గేటు లోపల ఇంటి ఆవరణలో పార్కింగ్ చేయాలి. బైక్‌లకు హ్యాండిల్ లాక్ వేయడం తప్పనిసరి.
- పట్టణాల్లోని కాలనీలు, గ్రామాల్లోని ముఖ్య ప్రాంతాల్లో సామూహికంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. జ్యువెలరీ షాపులు, ఇతర దుకాణాల వద్ద సైతం సొంతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
- మెయిన్ డోర్‌కు తాళం వేసినప్పటికీ కర్టెన్స్ వేసి కనబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటికి తాళం వేసినట్లు రోడ్డుపై నుంచి వెళ్లే వారికి కనిపించకుండా ఉండాలి.
- ముఖ్యంగా వేసవిలో ఆరుబయట నిద్రించేవారు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఇళ్లకు తాళం వేయడం తప్పనిసరి.

జిల్లాలో ఇటీవలి ఘటనలు

- మార్చిలో కౌటాల, చింతలమానెపల్లి మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లోని బోర్ మోటార్లను దుండగులు ఎత్తుకెళ్లారు.
- మార్చి 20న రాత్రి రెబ్బెన మండలం భగత్ సింగ్‌నగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి విఫల యత్నం చేశాడు.
- మార్చి 20న రాత్రి కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం క్వార్టర్ నంబర్ సి– 126లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలతోపాటు బీరువా తాళాలు పగులగొట్టి అందులోని బంగారు ఆభరణాలు, రూ.10,500 నగదు దోచుకెళ్లారు.
- మార్చి 30న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రూ.2.11 లక్షల విలువైన యంత్రాన్ని ఓ వ్యక్తి ఎత్తుకెళ్లాడు. ఆసుపత్రికి వచ్చి బీపీ ఆపరేటర్లమని నమ్మించి అత్యవసర చికిత్స విభాగం గదిలోని డిఫిబిలేటర్(కార్డియాక్ అరెస్ట్ అయినప్పుడు షాక్ ఇచ్చే యంత్రం) ఎత్తుకెళ్లాడు.
- ఈ నెల 4న కాగజ్‌నగర్ పట్టణంలో మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి అఖిలేష్ పిల్లల హాస్పిటల్ వద్ద పార్కింగ్ చేసిన బైక్‌ను దర్జాగా వేసుకుని వెళ్లాడు.
- ఈ నెల 15న కాగజ్‌నగర్ గోకుల్ చాట్‌లో ఓ వ్యక్తి రూ.40 వేల విలువైన మొబైల్ ఫోన్‌ను చాకచక్యంగా ఇద్దరు వ్యక్తులు తస్కరించారు.
- కౌటాల మండలం బోదంపల్లిలోని మధునపోచమ్మ ఆలయంలో ఈ నెల 16న తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు గుడి గేటు తాళం పగలకొట్టి హుండీ డబ్బులు దోచుకున్నారు.

డయల్ 100కు ఫోన్ చేయండి

ప్రజలు రోజుల తరబడి ఇళ్లకు తాళం వేసి వెళ్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇంట్లో విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు, బంగారు నగలు, డబ్బులు వెంట తీసుకెళ్లాలి. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా.. ఎక్కడైనా చోరీ జరిగినట్లు గుర్తించినా వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలి. పోలీసుశాఖ సూచించిన జాగ్రత్తలు పాటించాలి.

– కరుణాకర్, కాగజ్‌నగర్ డీఎస్పీ

ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతాం

- రాష్ట్ర మంత్రి సీతక్క



బెజ్జూర్‌లో సీతక్కను సన్మానిస్తున్న నాయకులు

బెజ్జూర్(సిర్పూర్): కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు తప్పకుండా అమలు చేసి తీరుతామని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బెజ్జూర్ మండల కేంద్రంలో శనివారం నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదిలాబాద్ పార్లమెంటరీ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలోనే రైతుబంధు పూర్తిస్థాయిలో అందిస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం వేలకోట్లు అప్పులు చేసిందని ఆరోపించారు. రుణమాఫీపై మాజీ మంత్రి హరీశ్‌రావు మాటిమాటికీ రాజీనామా అంటున్నారని మండిపడ్డారు. కేంద్రంలో పదేళ్లు ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆలయాల పేర్లతో ఓట్లు వేయించుకున్నా చేసిందేమీ లేదన్నారు. మళ్లీ బీజేపీ ప్రభుత్వం వస్తే మనకు పుట్టగతులుండవని పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ మాట్లాడుతూ.. ప్రతిదీ ప్రైవేట్‌పరం చేసి ప్రజలకు ఇబ్బందుల పాలు చేసే కుట్ర జరుగుతుందన్నారు. అభివృద్ధి చేసే పార్టీ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో చందాలు వసూలు చేసి అయోధ్యలో రామాలయం నిర్మించారని ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, నాయకులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ఆదిలాబాద్ ఆవాజ్ వినిపించాలి

పెంచికల్‌పేట్: పార్లమెంట్‌లో ఆదిలాబాద్ ఆవాజ్ వినిపించడానికి కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. మండల కేంద్రంలో శనివారం పెంచికల్‌పేట్, దహెగాం మండలాల కాంగ్రెస్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అటవీ హక్కుల పేరుతో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవడం ఏంటని ప్రశ్నించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ మాట్లాడుతూ గెలిచినా.. ఓడినా ప్రజలకు సేవ చేయడమే లక్ష్యమన్నారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి అత్యధిక మెజారిటీ అందిస్తామని అన్నారు. అనంతరం కమ్మర్‌గాంకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు మంత్రికి వినతిపత్రం అందించారు. సమావేశంలో మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి, జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, జెడ్పీటీసీ సరిత, ఎంపీపీ సుజాత, మాజీ జెడ్పీ చైర్మన్ గణపతి, నాయకులు భరత్ వాఘ్మారే, ఘనపురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శుభ విరామం..!

- మూఢం, ఆషాఢమాసం
- వివాహ ఘడియలకు నేడు చివరిరోజు
- ఇక ఆగస్టు వరకు ఆగాల్సిందే..

నిర్మల్‌ఖిల్లా: పెళ్లిళ్లు, శుభకార్యాలకు ఆదివారం నుంచి బ్రేక్ పడనుంది. గురుమూఢం ప్రారంభంతో జూలై 8 వరకు ఎలాంటి ముహూర్తాలు లేవని వేద పండితులు వెల్లడిస్తున్నారు. ఆ తర్వాత ఆషాడమాసం ప్రారంభం కానుండడంతో పెళ్లిళ్లు శుభకార్యాలు ఉండవు. శ్రావణమాసం ఆగస్టులో కొత్త ముహూర్తాలున్నట్లు ప్రముఖ వేదపండితుడు సముద్రాల శ్రీకాంతాచార్యులు 'సాక్షి'తో పేర్కొంటున్నారు.

గ్రహాలస్థితిని బట్టి మూఢం..

వివాహ తదితర శుభకార్యాలకు గ్రహాల స్థితిని బట్టి ముహూర్తాలు నిర్వహిస్తారు. జ్యోతిష్యులు చెబుతున్నా వివరాల ప్రకారం గురుగ్రహం సూర్యుడికి దగ్గరగా వచ్చినప్పుడు గురుమౌఢ్యంగా, శుక్ర గ్రహం సూర్యగ్రహానికి దగ్గరగా వచ్చినప్పుడు శుక్ర మౌఢ్యంగా పిలుస్తారు. ఈ కాలాన్ని ఏవైనా నూతన పనుల ప్రారంభం లేదా వివాహ బంధం ఏర్పడడానికి అశుభంగా భావిస్తూ పనులు వాయిదా



వేస్తారు. ఈ సంవత్సరం శుభకార్యాలు ఆశ్వయుజమాసంలో మొదలయ్యాయి. ఒక పుష్యమాసంలో తప్ప మిగతా కార్తీక, మాఘ, చైత్రమాసాల్లో పెళ్లిళ్లు, గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాలు పెద్దఎత్తున జరిగాయి. కొన్ని సందర్భాల్లో అత్యవసరంగా భావించేవారు కొన్ని అనుకూలతలు దృష్టిలో ఉంచుకొని ముహూర్తాలు పెట్టుకున్నారు. అయితే గత నాలుగైదు నెలల కాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా దాదాపు 10 వేలకు పైగా పెళ్లిళ్లు జరిగాయని పురోహితులు అంచనా వేస్తున్నారు.

ఎన్నికల హడావుడితో కాస్త ఉపశమనం

ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల హడావుడి కొనసాగుతోంది. వీటి తర్వాత స్థానిక సంస్థలు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉండనున్నట్లు తెలుస్తోంది. అయితే వివిధ వృత్తుల్లో ఉపాధి పొందుతున్న వారికి ఎన్నికల హడావుడి ద్వారా ఉపశమనం లభించనుంది. ఇప్పటికే ఇక పెళ్లిళ్ల సీజన్‌కు విరామం ఏర్పడనుండడంతో ఎన్నికల సీజన్ మరో అవకాశంగా లభించనుంది. ప్రధానంగా పార్టీల ప్రచారం కోసం టిఫిన్లు, భోజనాలు, తయారీ టెంట్ హౌస్ సామాన్లు, వాహనాలు, కూలీల అవసరం ఉండనుంది.

ఇక ఆగస్టు 8 వరకు విరామం

ఆదివారం పెళ్లిళ్లు, శుభకార్యాలకు చివరిరోజు కావడంతో ఇక ఆగస్టు వరకు శుభకార్యాలకు బ్రేక్ పడనున్నాయి. ఆగస్టు 8 తర్వాతే జరగనున్నాయి. అప్పటివరకు వీటిపై ఆధారపడిన వృత్తుల వారు, బ్యాండ్, వాయిద్యా కళాకారులు, ఈవెంట్ నిర్వాహకులు, టెంట్ హౌస్ యాజమాన్యాలు, పూలు, క్యాటరింగ్ తదితర రంగాల్లో ఉపాధి పొందుతున్నవారు విశ్రాంతి తీసుకోవాల్సిందేనని చెబుతున్నారు.

క్లుప్తంగా

డంపింగ్ యార్డుకు నిప్పు



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఆర్‌కే1 గని సమీపంలో గల డంపింగ్ యార్డుకు శనివారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో పెద్ద ఎత్తున మంటలతో పాటు దట్టమైన పొగ వ్యాపించింది. మంటలు ఎగిసిపడి సమీపంలోని సింగరేణి సీహెచ్‌పీ వైపు వ్యాపించడంతో అక్కడ ఉన్న బొగ్గు నిల్వలకు మంటలు అంటుకున్నాయి. వెంటనే ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను అదుపుచేశారు. కాగా, ఇటీవలకాలంలో తరచూ డంపింగ్ యార్డుకు ఆకతాయిలు నిప్పుపెడుతుండటంతో సమీపంలో ఉన్న ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న ఎస్‌హెచ్‌వో

బెల్లంపల్లి: ప్రమాదవశాత్తు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఎట్టకేలకు పట్టుకుని బాధితుడికి పోలీసులు అప్పగించారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎస్.దేవయ్య కథనం ప్రకారం.. పట్టణంలోని అంబేద్కర్‌నగర్ బస్తీలో నివాసం ఉంటున్న గొర్ల బానేశ్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు గత జులైలో బైక్‌పై ఇంటికి వెళ్తుండగా సెల్‌ఫోన్ పాగొట్టుకున్నాడు. దారెంట వెతికిన దొరకలేదు. ఈ ఘటనపై వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇన్నాళ్లు సదరు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండగా తాజాగా ఆన్ చేశారు. దీంతో సమాచారం అందుకుని ఓ మొబైల్ షాపులో ఓ వ్యక్తి అమ్మకం చేసిన బానేశ్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడికి ఎస్‌హెచ్‌ఓ అప్పగించారు.

పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించాలి



యువకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

తాండూర్: విద్యావంతులైన యువకులు పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలని అదనపు కలెక్టర్ బి.రాహుల్ సూచించారు. మండలంలోని బోయపల్లి గ్రామంలో విద్యావంతులకు శనివారం పుస్తకాలు, కుర్చీలు, ఇతర సామగ్రిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన యువకులతో మాట్లాడుతూ గ్రామ యువకులు ఎంతో పట్టుదలతో ఓ ఇంటిని గ్రంథాలయంగా మార్చి పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావడం హర్షనీయమన్నారు. గ్రంథాలయానికి సౌకర్యాలు కల్పించిన అదనపు కలెక్టర్‌కు యువకులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ అధికారి సత్యనారాయణ, కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్‌కు రాజీనామా

శ్రీరాంపూర్: టీబీజీకేఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ఆ యూనియన్ బ్రాంచి నాయకుడు తొంగల రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. యూనియన్‌లో చాలా కాలంగా పనిచేశానని, ఇటీవల యూనియన్‌లో చోటుచేసుకున్న పరిణామాలతో రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. తన రాజీనామాపత్రాన్ని యూనియన్ బ్రాంచి ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్‌కు సమర్పించినట్లు తెలిపారు.

తాగునీరు కలుషితం !



నీటిడ్రమ్ముపై బల్లి



క్యాంటీన్‌లో అపరిశుభ్రత నీటితో ఫ్రిజ్

జైపూర్: అసలే ఎండలు దంచికొడుతున్నాయి. ఎండవేడిమికి తోడు జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు ఆవరణలో అత్యధికంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం వేసవి తాపానికి నీటి కోసం కాంట్రాక్ట్ కార్మికులు అల్లాడుతున్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ బాధ్యత చేపడుతున్న పవర్‌మేక్ కంపెనీతోపాటు దానికి సబ్‌గా వ్యవహరిస్తున్న కంపెనీల్లో సుమారు వెయ్యిమందికిపైగా కార్మికులు ఉన్నారు. రెండు యూనిట్లలో డిపార్టుమెంట్ల వారీగా మూడు షిఫ్టుల్లో పని చేస్తున్నారు. పని ప్రాంతాల్లో కార్మికులకు డ్రమ్ములు, ప్లాస్టిక్ డబ్బాల ద్వారా తాగునీటి అందించడం వాటికి సరిగ్గా శుభ్రం చేయడం లేదు. క్యాంటీన్‌తోపాటు రెండ్రు ప్రాంతాల్లో ఫ్రిజ్‌లు ఏర్పాటు చేసినా నిర్వహణ సక్రమంగా లేకనే నీరు తాగే పరిస్థితి లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కనీస సౌకర్యాలను కల్పించేలా చర్యలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు.

కనీస సౌకర్యాల్లేవు



పవర్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. పని ప్రాంతాల్లో కనీసం చల్లటి తాగునీరందించడం లేదు. ఓ వైపు ఎండవేడితో ఇబ్బంది పడుతున్నప్పటికీ అధికారులు ఏమాత్రం పట్టింపు చేయడం లేదు. ఇక క్యాంటీన్‌ల్లో ఏదీ క్వాలిటీగా ఉండటం లేదు.

– చిప్పకుర్తి సంపత్,
హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్, ఎస్టీపీపీ

రూ.2.96 లక్షల నగదు పట్టివేత

తాండూర్: తాండూర్ నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న ఓ కారులో నుంచి పోలీసులు నగదు పట్టుకున్నారు. ఎస్సై జగదీశ్ కథనం ప్రకారం..తాండూర్ ఐబీ శనివారం వారసంత ప్రాంతంలో శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో మహారాష్ట్ర వైపు వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయడంతో కారులో ఉన్న శాంకరి మహేశ్ వద్ద రూ.2.96 లక్షల నగదు లభించాయని ఎస్సై తెలిపారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.



నగదు స్వాధీనం చేసుకుంటున్న ఎస్సై

కొత్త గనుల ఏర్పాటుకు కృషి


- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో కొత్త గనులు తీసుకురావడానికి గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ కృషి చేసిందని యూనియన్ అధ్యక్షుడు వి.సీతారామయ్య తెలిపారు. శనివారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై కార్మికులను కలిసి మాట్లాడారు. కొత్త గనులు వస్తేనే సింగరేణికి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్మికులకు ఆదాయపన్ను మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎంపీగా పోటీ చేసే అభ్యర్థులు గనులపైకి వస్తే ఈ హామీ నెరవేర్చాలని డిమాండ్ చేయాలన్నారు. సింగరేణిలో కార్మికుల హక్కుల సాధనకు రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ను ఈసారి ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్‌కు చెందిన పలువురు కార్యకర్తలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శు కె.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, సహాయ కార్యదర్శి ఎం.కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, ఫిట్ సెక్రటరీ మోతే లచ్చన్న, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, దాడి రాజయ్య, సత్తయ్య, మోహన్ రెడ్డి, మల్లెత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీతారామయ్య

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యం, నిందితులతో ఎస్సై రాములు, టాస్క్ ఫోర్స్ ఎస్సై లచ్చన్న

భీమారం: అక్రమంగా వాహనంలో తరలిస్తున్న రూ.2 లక్షల విలువ గల మద్యం బాటిళ్లను మండలంలోని మాంతమ్మ ఆలయ సమీపంలో జాతీయ రహదారి వద్ద శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై బి.రాములు కథనం ప్రకారం.. మంచిర్యాల నుంచి మహారాష్ట్ర వైపు టాటాఏసీ వాహనంలో మద్యం తరలిస్తున్నారనే సమాచారంతో భీమారం–జైపూర్ మధ్య జాతీయ రహదారి వద్ద టాస్క్‌ఫోర్స్ ఎస్సై లచ్చన్న సిబ్బందితో కాపు కాశారు. అనుమానాస్పదంగా వస్తున్న టాటాఏసీ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా మద్యం కాటన్లు లభ్యమయ్యాయి. కోటపల్లి మండలం అన్నారం గ్రామానికి చెందిన డ్రైవర్ మహ్మద్ షరీఫ్, తిప్పారపు రమణయ్యను విచారించారు. మద్యాన్ని మహారాష్ట్రకి తరలిస్తున్నామని ఒప్పుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న టాటాఏసీతోపాటు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్టు



పోలీసుల అదుపులో గంజాయి విక్రయదారుడు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయించేందుకు వచ్చిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. పక్కా సమాచారంతోనే రైల్వేస్టేషన్ ఏ క్యాబిన్, పోచమ్మ టెంపుల్ ప్రాంతాల్లో శనివారం సీఐ సిబ్బందితో కలిసి తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తి వద్ద 250 గ్రాముల గంజాయి, హుక్కా లభించింది. సదరు వ్యక్తి వివరాలు సేకరించగా కలకత్తాకు చెందిన దేవనాత్ రాయ్(25) మహారాష్ట్ర నుంచి గంజాయి తెచ్చి మంచిర్యాల రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారని చెప్పాడు. ఇతడు బతుకుదెరువు కోసం రైళ్లలో సమోసాలు అమ్మితే వచ్చే డబ్బులు సరిపోకనే గంజాయి అమ్ముతున్నాడు. ఈక్రమంలో అతడు గంజాయికి బానిసయ్యాడు. ఈనెల 26న బల్లార్షకు వెళ్లి 1250 గ్రాముల గంజాయి కొనుగోలు చేసుకొని వచ్చాడు. శనివారం పోచమ్మగుడి వద్ద గంజాయి తాగి అక్కడికి వచ్చే వారికి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాడు. పోలీసులు అతని తనిఖీ చేయగా 250 గ్రాముల గంజాయితోపాటు తాగేందుకు ఉపయోగించే హుక్కాను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి



వినోద్ మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని రాయల్‌గార్డెన్ సమీపంలో సంజీవయ్యకాలనీకి చెందిన యువకుడు బొమ్మెన వినోద్ (30) అనుమానాస్పదంగా మృతిచెందాడు. పట్టణ సీఐ శంకరయ్య, ఎస్సై అంజయ్య తమ సిబ్బందితో శనివారం ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకేరోజు మూడు చోరీలు



బీరువాను పరిశీలిస్తున్న డీఎస్పీ కరుణాకర్

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణం, మండలంలో ఒకేరోజు మూడు చోరీలు జరిగాయి. పట్టణంలోని పెట్రోల్‌పంపు ఏరియాలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న మున్నీ బార్ అండ్‌రెస్టారెంట్‌లో శనివారం తెల్లవారుజాము 3.30 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి రెస్టారెంట్‌పై ఇనుప రేకును తొలగించి వైన్స్ గదిలో చొరబడ్డారు. రూ.3 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. రెస్టారెంట్‌లో ఉన్న సీసీ కెమెరాల్లో దొంగతనం చేసిన వ్యక్తి ముఖానికి నలుపు రంగు వస్త్రాన్ని ధరించి ఉన్నారు. మండలంలోని భట్‌పల్లికి చెందిన తోట శోభ ఇంటి తాళం పగులగొట్టి దొంగలు బీరువా తాళం తొలగించి మూడున్నర తులాల బంగారంతోపాటు రూ.50 వేల నగదు చోరీకి గురైంది. ఫింగర్‌ప్రింట్స్, డాగ్‌స్క్వాడ్ బృందాలతో సంఘటన జరిగిన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ కరుణాకర్, పట్టణ సీఐ శంకరయ్య, రూరల్ ఎస్సై సోనియా, పట్టణ ఎస్సై అంజయ్య, మహేందర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ

శ్రీరాంపూర్: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే కు సంబంధించిన వాల్ పోస్టర్లను కాంట్రాక్ట్ కార్మికులు ఆవిష్కరించారు. సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.బ్రహ్మానందం చేతుల మీదుగా శనివారం శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడేను కార్మికులు ఘనంగా జరుపుకోవాలన్నారు. 12 గంటల పని విధానాన్ని నేడు బీజేపీ ప్రభుత్వం తీసుకురావడానికి కుట్ర చేస్తుందని దీన్ని తిప్పికొట్టాలన్నారు. మే 1న జరిగే కార్మిక దినోత్సవం పెద్ద ఎత్తున విజయవంతం చేయవలసిందిగా కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకన్న, సురేష్, రాజేష్, రాంబాబు, అనిల్, సమ్మయ్య పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

బీజేపీలో భగ్గుమన్న అంతర్గత విభేదాలు

- ఎన్నికల ప్రచారంలో దాడులు చేసుకున్న ముఖ్య నేతలు
- ఒకరిపై కేసు నమోదు

రెబ్బెన: బీజేపీలో ఒక్కసారిగా అంతర్గత విభేదాలు భగ్గుమన్నాయి. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రెబ్బెన మండలంలోని నారాయణపూర్, నంబాల గ్రామాల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ ప్రచారం నిర్వహించారు. నంబాలలో ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీరా ఆత్మారాం నాయక్, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కోట్నాక విజయ్ మధ్య కొన్నేళ్లుగా రగులుతున్న విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే వీరి ఇద్దరి మధ్య సోషల్ మీడియా వేదికగా మాటల యుద్ధం కొనసాగింది. ఎన్నికల అనంతరం కాస్త సద్దుమణిగినట్లు అనిపించినా.. నంబాలలో మరోసారి బహిర్గతమయ్యాయి. ఇటీవల చేరిన వారికే పార్టీ కార్యక్రమాల విషయంలో ప్రాధాన్యత ఇస్తూ ఏళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్న వారిని పట్టించుకోవడం ఆత్మారాం నాయక్.. పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపెల్లి శ్రీనివాస్‌పై రుసరుసలాడినట్లు సమాచారం. అక్కడే ఉన్న కోట్నాక విజయ్ కలగచేసుకోవడంతో ఇద్దరి మధ్య ఘర్షణ మొదలైంది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు చేయి కూడా చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘర్షణ సమయంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమన్న, ఎంపీ అభ్యర్థి నగేశ్‌తో పాటు, జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు. వారు కల్పించుకుని ఇద్దరిని వారించడంతో ఘర్షణ సద్దుమణిగింది. ఎన్నికల సమయంలో జాతీయ పార్టీకి చెందిన ఇద్దరు ముఖ్య నేతలు బహిరంగంగా ఘర్షణకు దిగడం, భౌతికంగా దాడి చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

కోట్నాక విజయ్‌పై కేసు నమోదు

నంబాలలో నిర్వహించిన బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రెబ్బెన మండలంలోని కైరిగూడకు చెందిన అజ్మీరా ఆత్మారాంనాయక్‌పై దాడి చేసిన ఘటనలో శనివారం రాత్రి వాంకిడి మండలం మోకాజీగూడకు చెందిన కోట్నాక విజయ్‌పై కేసు నమోదైనట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. అజ్మీరా ఆత్మారాంనాయక్ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

రైస్‌మిల్లులో అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన విద్యుత్ సామగ్రి



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

- కాలిబూడిదైన విలువైన విద్యుత్ సామగ్రి
- సుమారు రూ.6 లక్షల నష్టం

నెన్నెల: మండల కేంద్రంలోని బొమ్మెన శ్రీమతి రైస్ మిల్లులో శనివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోయిన ఆస్తినష్టం వాటిల్లింది. సుమారు రూ.6 లక్షల విలువైన మెయిన్ విద్యుత్ వైర్లతో పాటు ప్యానల్ బోర్డు, విద్యుత్ స్టార్టర్‌లు, కెపాజిటర్లు, విద్యుత్ మీటర్లు కాలిబూడిదయ్యాయి. రైస్ మిల్లు యజమాని, ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..రైస్‌మిల్లులో పని చేసే ఆపరేటర్ వెంకటేశ్ శనివారం ఉదయం 4.30 గంటల ప్రాంతంలో రైస్ మిల్లుకు వెళ్లి షెటర్ ఎత్తి చూడగా మంటలు చెలరేగుతూ కనిపించాయి. వెంటనే పక్కనే ఉన్న బోర్ మోటారుతో మంటలార్పేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అప్పటికే విలువైన విద్యుత్ సామగ్రి అగ్నికి ఆహుతైంది. రైస్‌మిల్లు యజమాని బొమ్మెన శ్రీమతి విచారణ చేపట్టాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయా? లేదా ఎవరైనా కావాలనే చేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, విద్యుత్ ఏఈ మల్లయ్యకు చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఫోన్‌లో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్‌తో మాట్లాడారు. విచారణ వెంటనే చేపట్టి రిపోర్ట్ త్వరగా అందజేయాలన్నారు. బొమ్మెన శ్రీమతి ఆమె కొడుకు హరీశ్‌గౌడ్‌ను ఎమ్మెల్యే పరామర్శించి ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరగలేదని పోలీసులకు రిపోర్ట్ ఇచ్చినట్లు విద్యుత్ ఏఈ తెలిపారు. విద్యుత్ అధికారుల రిపోర్ట్ ఆధారంగా విచారణ చేపడుతున్నట్లు ఎస్సై ప్రసాద్ పేర్కొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

- విద్యుత్ శాఖ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌రెడ్డి
- కౌటాలలో 132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పరిశీలన

కౌటాల(సిర్పూర్): హెచ్చుతగ్గులు లేకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్‌శాఖ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. కౌటాల మండలం కోయగూడ సమీపంలో నిర్మిస్తున్న 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను శనివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గడువులోగా పనులు పూర్తి చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కౌటాల విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి మండలాల్లో అటవీ ప్రాంతం నుంచి విద్యుత్ తీగలు ఉండడంతో ఈదురు గాలులకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వేగంగా మరమ్మతులు చేపడుతూ.. ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ముందస్తు అంతరాయంపై సమాచారం ఇవ్వాలని సూచించారు. వేసవి నేపథ్యంలో ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరుపై దృష్టి సారించాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



పనులు పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

పార్టీలో ప్రతీ కార్యకర్తకు ప్రాధాన్యత

- ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ ఘనాటే

కాగజ్‌నగర్‌రూరల్: బీజేపీలో ప్రతీ కార్యకర్తకు ప్రాధాన్యత ఉంటుందని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ ఘనాటే అన్నారు. పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన ఓబీసీ జిల్లా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్ కా సాత్ సబ్ కా వికాస్ నినాదం కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. 27 శాతం ఓబీసీ రిజర్వేషన్ ఇప్పించిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందన్నారు. 27 మంది బీసీలను మంత్రులుగా తీసుకుని ఐదుగురికి కేబినెట్ హోదా కల్పించారన్నారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ ఓబీసీ నాయకుడు మోదీ మరోసారి ప్రధాని కావడం ఖాయమన్నారు. విశ్వకర్మ యోజన ద్వారా అందరికీ న్యాయం చేస్తామన్నారు. ఆరె కులస్తులకు ఓబీసీ సర్టిఫికెట్ సమస్య పరిష్కరిస్తామన్నారు. పార్టీ ఎంపీ అభ్యర్థి గోడెం నగేశ్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, సొల్లు లక్ష్మి, వీరభద్రచారి, సింధం శ్రీనివాస్, గోలెం వెంకటేశ్, విశ్వేశ్వర్ రావు, గజ్జల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంజయ్ ఘనాటే

పురుగుల మందు తాగి ఆత్మహత్య

చింతలమానెపల్లి: మండలంలోని బాలాజీఅనుకోడ గ్రామానికి చెందిన బండి సాదు (25) మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. సాదు గత కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 26న మద్యం మత్తులో ఇంట్లో గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి అతన్ని సిర్పూర్(టి)లోని సామాజిక ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తమ్ముడు హన్మంతు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

పాతమంచిర్యాల: బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్ల అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. బీసీలకు 27 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని బీపీ మండల్ కమిషన్ నివేదిక సమర్పిస్తే సిఫారసులకు మోక్షం లభించడం లేదన్నారు. నాయకులు కీర్తి భిక్షపతి, చంద్రమౌళి, సతీశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.